డేంజర్.. బ్రేకర్స్

- కార్నర్స్, స్పీడ్ బ్రేకర్లకు ఎలాంటి సిగ్నల్స్ ఏర్పాటు చేయని వైనం
- రోడ్డు సేఫ్టీ నియమాలకు విరుద్ధంగా నిర్మాణం
- ఆర్జీ–2ఏరియాలో 100కు పైగా స్పీడ్ బ్రేకర్లు
- వీర్లపల్లి సీహెచ్‌పీ సమీపంలో దాదాపు 12 ప్రమాదాలు



యైటింక్లయిన్ కాలనీలో మార్కింగ్ లేకుండా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్

యైటింక్లయిన్‌కాలనీ: ప్రధాన రోడ్లపై వాహనాల వేగాన్ని నియంత్రించేందుకు ఏర్పాటు చేస్తున్న స్పీడ్ బ్రేకర్లు ఎలాంటి రోడ్ సేఫ్టీ నియమాలు పాటించకుండా నిర్మించడంతో చాలా మంది ప్రమాదాలకు గురవుతున్నారు. సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించిన కోల్ కారిడర్ రోడ్లపై దాదాపు 100కు పైగా స్పీడ్ బ్రేకర్లు ఇష్టారీతిన ఏర్పాటు చేశారని వాహనదారులు వాపోతున్నారు. కార్నల్ వద్ద, మూలమలుపు ఏరియాలలో, స్పీడ్ బ్రేకర్స్ ఉన్న ప్రదేశాల్లో ఎలాంటి సూచికలు ఏర్పాటు చేయకపోవడంతో చాలా మంది సింగరేణి కార్మికులు, ప్రజలు ప్రమాదాలకు గురయ్యారు.

వీర్లపల్లి సీహెచ్‌పీ సమీపంలో ప్రమాదాలు..

యైటింక్లయిన్‌కాలనీ నుంచి గోదావరిఖనికి వెళ్లే కోల్ కారిడార్ రోడ్డు వీర్లపల్లి వద్ద సీహెచ్‌పీ సమీపంలో నూతనంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్ల వద్ద దాదాపు 12 మంది వాహనాదారులు ప్రమాదాలకు గురైనట్లు ప్రజలు చెప్తున్నారు. సోమవారం రాత్రి సింగరేణి కార్మికుడు తన భార్యతో బైక్‌పై వెళ్తుండగా స్పీడ్ బ్రేకర్ వద్ద బైక్ అదుపు తప్పింది. అతడి భార్య కిందపడగా అక్కడిక్కడే మృతి చెందింది. ఈ ఘటన చాలా మంది కార్మికులను, సింగరేణి యూనియన్ల నాయకులను, కాలనీ ప్రజలను కలచి వేసింది. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సింగరేణి యజమాన్యం చర్యలు తీసుకోవాలని ప్రజలు, కార్మికులు కోరుతున్నారు.

నియమాలకు విరుద్ధంగా..



సింగరేణి ఆధ్వర్యంలో నిర్మించిన కోల్ కారిడార్ రోడ్లపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లు రోడ్ సేఫ్టీ నియమాలకు విరుద్ధంగా నిర్మించారు. దీంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇలాంటి ఘటనలను టీబీజీకేఎస్ తీవ్రంగా ఖండిస్తుంది. రోడ్ సేఫ్టీ నియమాలు పాటిస్తూ స్పీడ్ బ్రేకర్లను ఏర్పాటు చేయాలి.

– ఐలి శ్రీనివాస్, టీబీజీకేఎస్ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్

అవసరమైన చోట మాత్రమే..



రోడ్ సేఫ్టీ నియమాలకు విరుద్ధంగా ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లను సింగరేణి యజమాన్యం వెంటనే తొలగించాలి. అవసరమైన చోట మాత్రమే స్పీడ్ బ్రేకర్లును రోడ్డుకు అనుకూలంగా నిర్మించాలి. సోమవారం వీర్లపల్లి సీహెచ్‌పీ వద్ద నిర్మించిన స్పీడ్ బ్రేకర్ వద్ద జరిగిన ఘటన మమ్మల్ని కలచి వేసింది.

– కొత్త సత్యనారాయణ రెడ్డి, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 వైస్ ప్రెసిడెంట్

గుర్తులు ఉండేలా చూడాలి



సింగరేణి యాజమాన్యం ఆధ్వర్యంలో సింగరేణి ప్రభావిత గ్రామాల్లో, కోల్ కారిడార్ రోడ్లపై ఏర్పాటు చేసిన స్పీడ్ బ్రేకర్లపై తగిన గుర్తులు ఉండేలా చూడాలి. బ్రేకర్లపై కలర్స్‌తో పాటు బ్రేకర్ల వద్ద విద్యుత్ దీపాలు ఏర్పాటు చేసి కనబడేలా పెయింటింగ్ వేయించాలి. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చర్యలు తీసుకోవాలి.

– జీగురు రవీందర్, ఐఎన్‌టీయూసీ ఆర్జీ–2 బ్రాంచ్ కార్యదర్శి



రామగుండం: పట్టణంలోని పెద్ద చెరువుకు ఆనుకొని ఉన్న హిందూ శ్మశాన వాటికలో సౌకర్యాలు కరువయ్యాయి. బల్దియా సిబ్బంది నిర్వహణ మరిచిపోయారు. ప్రాంగణం పూర్తిగా పిచ్చిమొక్కలు, ముళ్ల పొదలు, అడుగు వేస్తే దిగబడేంత బురద. కనీసం తాగునీరు, విద్యుత్ సరఫరా, శుభ్రమైన గది, స్నానాలు చేసేందుకు కుళాయి లేకపోవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. నిత్యం నీటి సరఫరా, విద్యుత్ సరఫరా, స్నానాలు ఆచరించేందుకు షవర్లు, కూర్చోవడానికి సిమెంట్ బెంచీలు ఏర్పాటు చేయాలని స్థానికులు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి, సీహెచ్.శ్రీకాంత్, మున్సిపల్ కమిషనర్, రామగుండం, సెల్ 98499 05878

వాట్సప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటి నుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్ : 97053 46608

క్లుప్తంగా

మదర్ సొసైటీ ఆధ్వర్యంలో వృక్షాబంధన్



చెట్టుకు రాఖీ కడుతున్న సొసైటీ సభ్యులు

గోదావరిఖనిటౌన్: పట్టణంలోని వేంకటేశ్వర స్వామి ఆలయంలో మదర్ హ్యూమన్ యూత్ సొసైటీ నిర్వాహకులు పిట్టల రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో ఆదివారం వృక్షాబంధన్ పేరిట ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. వృక్షానికి రాఖీ కట్టిన అనంతరం వృక్ష సంరక్షణ కోసం ప్రతిజ్ఞ చేశారు. జిల్లా కాంగ్రెస్ మైనార్టీ సెల్ సెక్రటరీ, అడ్వకేట్ తాజొద్దీన్ బాబా, ఆలయ కమిటీ సభ్యులు శ్రీనివాస్, రాజమౌళి, లచ్చయ్య, కట్ల శ్రీనివాస్, సొసైటీ సెక్రటరీ శ్రీవాణి, వైస్ ప్రెసిడెంట్ అహ్మద్‌పాషా, కనకయ్య పాల్గొన్నారు.

బీసీ రిజర్వేషన్లను 40శాతానికి పెంచాలి

సుల్తానాబాద్: కాంగ్రెస్ కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీ రిజర్వేషన్లు పెంచకపోతే ఆమరణ నిరాహార దీక్షలు చేపడతామని బీసీ యువజన సంఘం రాష్ట్ర కన్వీనర్ తంగెళ్లపల్లి రాజ్‌కుమార్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు.

పరామర్శ



పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే మనోహర్‌రెడ్డి

సుల్తానాబాద్: పట్టణానికి చెందిన సీనియర్ జర్నలిస్ట్ బైరగోని రవీందర్, బీఆర్ఎస్ నాయకుడు బైరగోని ప్రభాకర్ తండ్రి బైరగోని బక్కయ్యగౌడ్ ఇటీవల గుండెపోటుతో మరణించారు. కాగా ఆదివారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో సుల్తానాబాద్ బీఆర్ఎస్ టౌన్ ప్రెసిడెంట్ పారుపల్లి గుణపతి, నాయకులు సర్వర్, మధుసూదన్‌రెడ్డి, ఎల్లయ్య, మహ్మద్ రఫీక్, కిరణ్, విజయ్ పాల్గొన్నారు.

ఆర్‌అండ్‌బీకి పూర్వ వైభవం తెస్తాం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ రోడ్లు భవనాల శాఖ అతిథి గృహానికి పూర్వ వైభవం తెచ్చేలా పనిచేస్తామని మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి అన్నారు. రోడ్లు భవనాల శాఖ అధికారి గృహం ముందు ఉన్న పిచ్చి మొక్కలను ఆదివారం ట్రాక్టర్ ద్వారా తొలగించారు. పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు, స్థానిక కాంగ్రెస్ నాయకుల సూచన మేరకు గతంలో ఉన్న రోడ్లు భవనాల శాఖ అతిథి గృహాన్ని అందరికీ అందుబాటులో ఉండేలా చేసేందుకు కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామానికి చెందిన బదావత్ సమ్మక్క అనే యువతి వివాహానికి గ్రామ మాజీ సర్పంచ్ రాజునాయక్ ఆర్థికసాయం అందించారు. ఆదివారం గ్రామంలో జరిగిన వివాహానికి హాజరైన రాజునాయక్ దంపతులు రూ.10వేలు అందజేశారు. గట్టయ్య, శ్యాముల్, సరిత పాల్గొన్నారు.

బీసీలంతా ఏకం కావాలి

పెద్దపల్లిరూరల్: బీసీలంతా ఏకమై పెద్దపల్లిలో ఈనెల 20న తలపెట్టిన బీసీ సదస్సును విజయవంతం చేయాలని అఖిల భారత యాదవ మహాసభ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీనివాస్‌యాదవ్ కోరారు. పెద్దపల్లిలో ఆదివారం ఆయన మాట్లాడారు. స్థానిక ఎన్నికల్లో బీసీలు తమ సత్తా చాటాలన్నారు. నాయకులు శ్రీహరి, మల్లేశం, తిరుపతి, నాగరాజు, కొమురయ్య, మహేందర్, పర్శరాములు ఉన్నారు.

నేడు ఆలయంలో రుద్రాభిషేకం

జూలపల్లి: శ్రావణమాస, రాఖీ పౌర్ణమిని పురస్కరించుకొని మండల కేంద్రంలోని శ్రీరాజరాజేశ్వర స్వామి ఆలయంలో సోమవారం ఉదయం కల్యాణ మండపం, అదనపు గదుల నిర్మాణానికి కొండపాక శ్రీనివాసచార్యులు భూమిపూజతో పాటు రుద్రాభిషేకం నిర్వహించనున్నట్లు ఆలయ అర్చకులు ఉద్దండ నవీన్, అభివృద్ధి కమిటీ సభ్యులు మాజీ సర్పంచ్ పొట్లాల మల్లేశం, వజ్రారెడ్డి, పాటకుల అనిల్ తెలిపారు. అనంతరం మండోట దుర్గామాత నవరాత్రి ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో అన్నదానం కార్యక్రమం ఉంటుందన్నారు.

పొత్కపల్లిలో వాహనాల తనిఖీ

ఓదెల: మండలంలోని పొత్కపల్లి గ్రామంలో ఏఎస్సై సుధాకర్ ఆధ్వర్యంలో ఆదివారం వాహనాలను తనిఖీ చేశారు. రైల్వేస్టేషన్ పరిధిలో పొత్కపల్లి నుంచి ఓదెల, సుల్తానాబాద్ వైపు వెళ్లే వాహనాలను తనిఖీ చేశారు.

సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి



అవగాహన కల్పిస్తున్న టూటౌన్ సీఐ ప్రసాద్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ: ఆర్జీ–2 ఏరియా పోతనకాలనీ క్వార్టర్స్ ఏరియాల్లో ప్రతి బ్లాక్ వద్ద సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని గోదావరిఖని టూటౌన్ సీఐ ఎస్ ప్రసాద్‌రావు సింగరేణి కార్మికులకు సూచించారు. పోతన కాలనీలో ఉంటున్న సింగరేణి కార్మికులు, వారి కుటుంబ సభ్యులతో పాటు ఇతర ప్రజలకు దొంగతనాల నివారణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆదివారం ఆయన అవగాహన కల్పించారు. ఎవరైనా కొత్త వ్యక్తులు కనిపిస్తే వెంటనే డయల్ 100కు సమాచారం అందించాలన్నారు. కార్మికులందరూ కలిసి ప్రతి బ్లాక్‌కు సంబంధించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలన్నారు. టూటౌన్ పోలీస్ సిబ్బంది, పోతనకాలనీ ప్రజలు పాల్గొన్నారు.

ప్రభుత్వ స్కూళ్లలో స్కావెంజర్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్



శుభ్రం చేస్తున్న మున్సిపల్ కార్మికులు

సుల్తానాబాద్: రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలలో పారిశుధ్య పనులు చేసేందుకు స్కావెంజర్ల నియామకానికి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చింది. కొన్నేళ్లుగా స్కావెంజర్లు లేక పారిశుధ్యం, మరుగుదొడ్లు కంపుకొడుతు ఉపాధ్యాయులు ఇబ్బంది పడ్డారు. కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు శుభ్రం చేసుకోగా మున్సిపల్, గ్రామపంచాయతీ సిబ్బంది అప్పుడప్పుడు వెళ్లి శుభ్రం చేసేవారు. ఉపాధ్యాయ సంఘాల నాయకులు పలువురు ప్రతినిధులు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడంతో సానుకూలంగా స్పందించి ప్రభుత్వ పాఠశాలలో స్కావెంజర్ల నియామకానికి ప్రభుత్వం అనుమతి ఇచ్చింది. ఆయా పాఠశాలలకు నిధులు మంజూరు చేస్తూ జీవో ఇటీవల జారీ చేసింది.

గుర్తింపు పత్రం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న నాయకులు

గోదావరిఖని: గెలిచిన సంఘాలు కార్మికుల సమస్యల కన్నా కాలపరిమితిపై పోరాడుతున్నాయని సీఐటీయూ నాయకులు మెండె శ్రీనివాస్ అన్నారు. యూనియన్ కార్యాలయంలో ఆదివారం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గుర్తింపు సంఘం ఎన్నికలు జరిగి 8నెలలు గడిచినా గుర్తింపు పత్రం ఇవ్వకపోవడంతో కార్మికుల సమస్యలు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్న చందంగా తయారైందన్నారు. కార్మికుల సొంతింటి కల, అలవెన్స్‌లపై ఇన్‌కంటాక్స్ మాఫీ, మారు పేర్లు మార్పు, పలు దీర్ఘకాలిక సమస్యలతో కార్మికులు ఇబ్బంది పడుతున్నారన్నారు. సమావేశంలో నాయకులు ఆరెపల్లి రాజమౌళి, వంగల రాములు, సానం రవి, శంకరన్న, వంగల శివరాంరెడ్డి, తాళ్ల శ్రీనివాస్, జనార్దన్, శ్రీనివాస్ పాల్గొన్నారు.

తప్పుడు పోస్టులు పెట్టేవారిపై చర్యలు తీసుకోండి



ఫిర్యాదు చేస్తున్న సీపీఎం నాయకులు

గోదావరిఖని: తమ పార్టీపై సోషల్‌మీడియాలో తప్పుడు పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని సీపీఎం నాయకులు కోరారు. గోదావరిఖని ఏసీపీ రమేశ్‌ను ఆదివారం కలిసి ఫిర్యాదు చేశారు. కొంత మంది పనికట్టుకొని నిజానిజాలు తెలుసుకోకుండా సోషల్ మీడియాని వేదికగా చేసుకుని లైవ్‌లు పెడుతూ తప్పుడు ప్రచారం చేస్తున్నారని విమర్శించారు. అసత్య ఆరోపణలో సోషల్ మీడియా పోస్టులు పెట్టే వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఫిర్యాదు అందజేసిన వారిలో నాయకులు వేల్పుల కుమారస్వామి, ఎరవెల్లి ముత్యంరావు, ఎ.మహేశ్వరి, ఎం.రామాచారి, మల్లు స్వరాజ్యం కాలనీ బాధితులు కాంతి, భాస్కర్, భాగ్యలక్ష్మి ఉన్నారు.

వ్యక్తిగత సమస్యలను యూనియన్‌కు ఆపాదించొద్దు



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

గోదావరిఖని: వ్యక్తిగత సమస్యలు యూనియన్‌కు ఆపాదించొద్దని ఏఐటీయూసీ కేంద్ర కార్యదర్శి కవ్వంపల్లి స్వామి, ఆరెల్లి పోచం కోరారు. స్థానిక భాస్కర్‌రావుభవన్‌లో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మహిళా కార్మికురాలు స్వప్న సంఘటనను కొన్ని కార్మిక సంఘాలు బూచిగా చూపెడుతూ యూనియన్ ప్రతిష్ట దిగజార్చేలా ప్రచారం చేస్తున్నాయని ఆరోపించారు. కొన్నిరోజుల క్రితం బస్టాండ్‌కాలనీలో జరిగిన సంఘటన దురదృష్టకరమని, అది వ్యక్తుల మధ్య, రెండు కుటుంబాల మధ్య సమస్య అన్నారు. ఏఐటీయూసీ నాయకులు దళితద్రోహి అని దుష్ప్రచారం చేయడం సరైంది కాదన్నారు. సమావేశంలో నాయకులు సంకె అశోక్, రంగు శ్రీనివాస్, ఎ.సురేశ్, ఎంఏ గౌస్, మద్దెల దినేశ్, పెర్క మహేందర్, కె.శ్రీనివాసరావు, చెప్యాల భాస్కర్, ఆకునూరి శంకరయ్య, మానాల శ్రీనివాస్, పర్లపెల్లి రామస్వామి, ఉప్పులేటి తిరుపతి, కలవేణి రాజేశ్, ఆఫీసు కార్యదర్శి తొడుపునూరి రమేశ్‌కుమార్ పాల్గొన్నారు.

బీసీలు ఏకం కావాలి



మాట్లాడుతున్న ఎన్‌జె శ్యాంసన్

గోదావరిఖనిటౌన్: జనాభాలో 60శాతం ఉన్న బీసీలు రాజ్యాధికారం దిశగా అందరూ పాటుపడాలని ఇండియన్ లీగల్ ప్రొఫెషనల్స్ అసోసియేషన్ (ఐఎల్‌పీఏ) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎన్‌జె శ్యాంసన్ అన్నారు. గోదావరిఖని బార్ అసోసియేషన్ ఆవరణలో ఆదివారం జరిగిన సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. బీసీలంతా ఐక్యమైతే రాజ్యాధికారంతో పాటు హక్కులను సాధించుకోవచ్చన్నారు. బీసీ న్యాయవాదులను చైతన్యం చేసి తద్వారా బీసీ సమాజాన్ని ఐక్యం చేసేందుకు ఐఎల్‌పీఏ ఆధ్వర్యంలో 25న హైదరాబాద్‌లోని మాసబ్‌ట్యాంకు జేఎన్‌టీయూ ఫైన్ ఆర్ట్స్ యూనివర్సిటీ ఆడిటోరియంలో నిర్వహించే ఓబీసీ న్యాయవాదుల సదస్సును విజయవంతం చేయాలని కోరారు. అనంతరం సదస్సుకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జవ్వాజి శ్రీనివాస్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఐఎల్‌పీఏ నాయకులు సాయిని నరేందర్, జూకూరి మహేశ్, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తొటం సతీశ్, ఉపాధ్యక్షుడు రామటెంకి శ్రీనివాస్, బీసీ న్యాయవాదులు వేల్పుల మురళీధర్‌యాదవ్, పుర్మ శ్రీనివాస్, ముచ్చకుర్తి కుమార్, రాగం శ్రీధర్, గుర్రాల రాజేందర్, సితకారి చంద్రశేఖర్, వేల్పుల అరుణ్, ముష్కె రవి, సిరిమల్ల అనిల్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

రాజకీయంగా బీసీలకు అన్యాయం



పోస్టర్ ఆవిష్కరిస్తున్న నాయకులు

కాల్వశ్రీరాంపూర్: బీసీలకు అన్నిరంగాల్లో అన్యాయం జరుగుతోందని బీసీ సంఘాల నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. కాల్వశ్రీరాంపూర్ అంబేద్కర్ చౌరస్తాలో ఆదివారం 'హలో బీసీ–చలో పెద్దపల్లి' పోస్టర్లను వారు ఆవిష్కరించారు. పెద్దపల్లి పట్టణంలోని ఎంబీ గార్డెన్ ఫంక్షన్‌హాల్లో 20న నిర్వహించే బీసీ సదస్సును విజయంతం చేయాలని మాజీ ఎంపీపీ నూనేటి సంపత్‌యాదవ్, బీసీ సంఘాలు, మున్నూరుకాపు సంఘం రాష్ట్ర నాయకుడు వివేక్ పటేల్ పిలుపునిచ్చారు. మున్నూరు కాపు సంఘం, బీసీ సంఘాల రాష్ట్ర నాయకుడు వివేక్ పటేల్, మాజీ ప్రజా ప్రతినిధులు కొట్టె రవి, జట్టి దేవేందర్, నాయకులు కుమార్, నవీన్, సదానందం, ఒడ్నాల శ్రీనివాస్, ఆషాడపు రాజయ్య, సారయ్య, రాయమల్లు, మహేందర్, కొమురయ్య పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్ష అభ్యర్థి ఖరారు

పాలకుర్తి: రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ఆదేశాల మేరకు బసంత్‌నగర్‌కు చెందిన కామోజ్వల వాసుదేవరావును యూత్ కాంగ్రెస్ మండల అభ్యర్థిగా ఖరారు చేసినట్లు కాంగ్రెస్ మండలాధ్యక్షుడు ముక్కెర శ్రీనివాస్ తెలిపారు. శనివారం బసంత్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వాసుదేవరావుకు సహకరించి గెలుపునకు కృషి చేయాలని కోరారు.

ఆసుపత్రికి జ్వర పీడితుల తాకిడి



పరీక్షల కోసం క్యూలో ఉన్న జనం

సుల్తానాబాద్: సుల్తానాబాద్ ప్రభుత్వాసుపత్రికి జ్వరాలతో వస్తున్న రోగుల తాకిడి పెరిగింది. అత్యవసర పరిస్థితుల్లో వచ్చి అడ్మిట్ అయ్యే వారి సంఖ్య ఎక్కువగా లేనప్పటికీ ఓపీకి వచ్చి వైద్యులతో పరీక్షలు చేయించుకుని వెళ్తున్న వారి సంఖ్య పెరుగుతున్నట్లు రికార్డుల ద్వారా తెలుస్తోంది. సాధారణ రోజుల్లో ప్రతీ సోమవారం, బుధవారం, శనివారాల్లో 300 నుంచి 400 వరకు ఓపీ సేవలు ఉండేవి. ఇటీవల ఓపీ సేవలు 500 వరకు పెరిగాయి. వాతావరణంలో వచ్చిన మార్పుల కారణంగా జలుబు, దగ్గు, నొప్పులు, జ్వరాలతో వచ్చే వారు ఎక్కువ సంఖ్యలో ఉన్నట్లు వైద్యులు తెలిపారు. సుల్తానాబాద్ ఆసుపత్రికి పట్టణంతో పాటు వివిధ గ్రామాలు, మండలాలకు చెందిన రోగులు ఆసుపత్రికి వస్తారు. ఎక్కువగా వ్యవసాయ పనులు చేసుకునే వారే అధికంగా వస్తారు. సుల్తానాబాద్, ఎలిగేడు, జూలపల్లి, కాల్వశ్రీరాంపూర్, ఓదెల మండలాల నుంచి ఆసుపత్రికి వస్తారు. పట్టణంతో పాటు పల్లెల్లో పల్లె దవాఖానలు ఉన్నప్పటికీ స్థానికంగా డాక్టర్లు, సిబ్బంది సమయపాలన పాటించడం లేదని స్థానికులు పలువురు ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేస్తున్నారు.

సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడికి సన్మానం



శ్రావణ్‌కుమార్‌ను సన్మానిస్తున్న ప్రతినిధులు

యైటింక్లయిన్‌కాలనీ: సదాశయ ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు టి.శ్రావణ్ కుమార్‌ను జైన్ సోషల్ గ్రూప్ సెంట్రల్ సంస్థాన్ ఆధ్వర్యంలో ఆదివారం సన్మానించారు. రాజస్థాన్‌లోని జైపూర్ బిర్లా స్టేడియంలో నిర్వహించిన జాతీయ అవయవదాన సదస్సు ముగింపు కార్యక్రమంలో శ్రావణ్ కుమార్ పాల్గొన్నారు. సదాశయ ఫౌండేషన్ సంస్థ ద్వారా నేత్ర, శరీర, అవయవ దానాలపై చేస్తున్న కృషిని గుర్తించి దేహదాన సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు జేఎస్‌జీ సెంట్రల్ సంస్థాన్ ఫౌండర్ చేతుల మీదుగా శ్రావణ్ కుమార్‌ను సన్మానించి జ్ఞాపిక బహూకరించారు. ఈ సందర్భంగా ఆయనను సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులతో పాటు పలు స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు అభినందించారు.

సర్వాయి పాపన్న ఆశయాలు కొనసాగిద్దాం



గోదావరిఖని: కేక్ కట్ చేస్తున్న నాయకులు

గోదావరిఖని/పెద్దపల్లిరూరల్/కాల్వశ్రీరాంపూర్/సుల్తానాబాద్/సుల్తానాబాద్‌రూరల్/జూలపల్లి/ఎలిగేడు/యైటింక్లయిన్‌కాలనీ కమాన్‌పూర్/జ్యోతినగర్/ఓదెల: బహుజన, బలహీన వర్గాల ఆశాజ్యోతి సర్దార్ సర్వాయి పాపన్నగౌడ్ ఆశయాలు కొనసాగిద్దామని నాయకులు కోరారు. జిల్లావ్యాప్తంగా ఆదివారం పాపన్నగౌడ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళి అర్పించారు. కేక్ కట్ చేసి, మిఠాయిలు పంపిణీ చేశారు.

రామగిరి వ్యవసాయాధికారిగా శ్రీకాంత్

రామగిరి: రామగిరి మండల వ్యవసాయాధికారిగా శనివారం చిందం శ్రీకాంత్ బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన భూక్య మోహన్ మంథనికి బదిలీ అయ్యారు. ముత్తారంలో పనిచేస్తున్న చిందం శ్రీకాంత్‌కు రామగిరి మండల వ్యవసాయాధికారిగా ఉత్తర్వులు జారీ చేశారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం



ఆత్మీయ సమ్మేళనంలో పూర్వ విద్యార్థులు

గోదావరిఖనిటౌన్: స్థానిక విద్యానగర్‌లోని శ్రీరామ విద్యాలయంలో 1999–2000లో పదో తరగతి చదివిన విద్యార్థులు ఆదివారం పాఠశాలలో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. శ్రీరామ విద్యాలయం వ్యవస్థాపకులు, ప్రధానోపాధ్యాయులు పిట్టల రాజేందర్ చిత్రపటానికి నివాళి అర్పించారు. అనంతరం తమకు పాఠాలు బోధించిన గురువులు పద్మావతి, భాగ్యలక్ష్మి, ఉమాదేవి, జయశ్రీ, జ్యోతి, బి.సరోజ, సిబ్బంది సాయిలు, యాదగిరిని సన్మానించారు.

బాధ్యతలు స్వీకరణ

ముత్తారం: మండల వ్యవసాయాధికారిగా అనూష శనివారం బాధ్యతలు చేపట్టారు. గతంలో పనిచేసిన శ్రీకాంత్ బదిలీపై రామగిరి మండలానికి వెళ్లారు.

రామగుండం రైల్వేస్టేషన్‌లో కుక్కల బెడద



రామగుండం: రామగుండం రైల్వే ప్లాట్‌ఫాంపై కుక్కల బెడదతో ఇబ్బంది పడుతున్నామని ప్రయాణికులు వాపోతున్నారు. ప్రతీరోజు రైల్వేస్టేషన్‌లో కుక్కలు, వానరాలతో ప్రయాణికులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అధికారుల వైఖరిపై తీవ్ర విమర్శలు గుప్పిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత రైల్వే అధికారులు రైల్వే ప్లాట్‌ఫాం పైకి కుక్కలు రాకుండా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.